"ఇప్పుడు ఒక్కొక్కరూ మీ మీ నిమ్మపళ్ళని తీసుకోండి."

శిష్యులు ఎలాంటి సందేహం లేకుండా ఆ నిమ్మపళ్ళలోంచి గత మూడురోజులుగా తమ దగ్గరున్న తమ తమ నిమ్మపళ్ళని గుర్తించి తీసుకున్నారు. వాటిమీద ఎలాంటి గుర్తులు లేకపోయినా ప్రతీ భక్తుడు సరిగ్గా తన నిమ్మపండునే తీసుకున్నాడు.

"చూడడానికి ఒకేలా కనబడే నిమ్మపళ్ళలోంచి, మీ నిమ్మపండుని మీరు సరిగ్గా ఎలా గుర్తించగలిగారో మీకర్థమైంది కదా? దీన్ని గుర్తుంచుకోగలిగిన మీరు, చిత్రపటంలోని దేవుడ్ని గుర్తుంచుకోలేరా? రహస్యం తెలిసింది కాబట్టి, దేవుడ్ని గుర్తుంచుకుని ధ్యానంలో ఆయన్నే చూస్తూ, దైవనామం స్మరించండి." చెప్పాడు గురువు.

శిష్యులు అది గ్రహించి అతి త్వరలోనే ధ్యానంలో విశేష ప్రగతిని సాధించారు.

## 29. స్త్రీ-అగ్ని

ఓ రాజు ఒకసారి అడవికి వేటకి వెళ్ళాడు. వేటలో బాగా అలసిపోయిన ఆయన ఒక ముని ఆశ్రమం చేరాడు. ఆ రాత్రి రాజు ఆ ఆశ్రమంలోనే విశ్రాంతి తీసుకున్నాడు.

మర్నాడు ఉదయం రాజు ముని దగ్గరకి వెళ్ళాడు. రాజుని ముని వెంటనే పట్టించుకోలేదు. తన ఆశ్రమంలోనే బసచేసిన ఓ సన్యాసికి ముందుగా నమస్కరించి, ఆ తర్వాత రాజుకి నమస్కారం చేసాడు. దాంతో రాజు అహం దెబ్బతింది. రాజధానికి వెళ్ళాక, మంత్రులని పిలిపించి ముని చేసిన అవమానాన్ని కోపంగా వివరించాడు. వారి సలహా మీద సేనాధిపతిని పిలిచి ఆజ్ఞాపించాడు.

"ఆభరణంగా వంటిమీద బూడిద తప్ప ఇంకేం లేని ఆ సన్యాసి నాకన్నా గొప్పవాడనా ఆయన ఉద్దేశం? వెళ్ళి కనుక్కురండి."

సేనాధిపతి ముని కుటీరానికి వెళ్ళి ఆయన నించి ఓ ఉత్తరంతో తిరిగి వచ్చాడు. రాజుకి రాసిన ఆ ఉత్తరంలో ఇలా వుంది.

"నువ్వు స్త్రీని, అగ్నిని పరిపూర్ణంగా త్యాగం చేస్తే, నీకు రెండుకోట్ల రూపాయలిస్తాను. ఆలోచించి కబురు చెయ్యి."

రాజు, మంత్రులు ఆ ఉత్తరంలోని విషయం గురించి ఆలోచించి, 'కోట్లకొద్దీ ధనంవుంటే స్త్రీపొందు తేలికౌతుంది. స్త్రీని త్యాగం చేసాక ఆ డబ్బుండీ ఏం లాభం? అలాగే అగ్నిని త్యాగం చేస్తే, ఇక పచ్చి కూరగాయలే తినాల్సి వుంటుంది.రుచికరమైన భోజన పదార్థాలు లేకుండా బ్రతికి ప్రయోజనం ఏమిటి?' అనుకున్నారు.

రాజు అందుకు కుదరదని జవాబు రాసాక, సేనాధిపతి ఇంకో లేఖ తీసిచ్చి చెప్పాడు.

"మీరు సమాధానం యిచ్చేదాకా ఆగి, ఆ తర్వాత దీన్ని మీకివ్వమని ముని చెప్పారు."

రాజు మంత్రికి ఆ వుత్తరం యిచ్చి బయటికి చదవమని చెప్పాడు. అందులో ఇలా వుంది.

"రాజా! నువ్వు రుచికరమైన ఆహారాన్ని, స్త్రీ పొందుని, నీకు ధనం ఇచ్చినా వదలడానికి సిద్ధంగా లేవు. కాని ఎలాంటి ప్రతిఫలం కోరకుండా ఆ సన్యాసి ఆ రెంటినీ త్యాగం చేయగలిగాడు. మీ ఇద్దరిలో ఎవరు గొప్పవారో వారికే ముందుగా నమస్కరించి తర్వాత మీకు వందనం చేసాను. ఇందులో తప్పుందేమో పండితులనడిగి తెలుసుకో."

ఆ ఉత్తరం చదవగానే రాజు సిగ్గుతో చితికిపోయాడు.

త్వరలోనే రాజు ఇంద్రియాల మీద వ్యామోహం వదిలించుకుని ఆ మునిని తన గురువుగా స్వీకరించి ఆధ్యాత్మిక మార్గంలోకి మళ్ళాడు.